కథానిక

# చిలిపి కయ్యం

అవసరాల రామకృష్ణరావు

శుభ్రంగా తుడిచిన గచ్చు నేలమీద రెండు గజాలు ఎడంగా పక్కలు వేసుకుని ఎడమొహం పెడమొహంగా పడుకున్నారు శారదా, రామకృష్ణా. అంతగా కోపాలు రావడానికి కారణం ఎంత చిన్నదైనా వింటే సరదాగా వుంటుంది కాబట్టి చెప్పుకోక తప్పదు.

పొద్దుటే కాఫీ తాగి వంటింటిగదిలోంచి యివతలకొస్తూంటే చూసుకోక పోడంచేత రామకృష్ణ మోచెయ్యి గదితలుపుకి ఠకీమని తగిలింది. శారద పకపకమని నవ్వింది. ఎంతలా నవ్విందంటే, తాగుతున్న కాఫీ జాకెట్టుమీద ఒలకబోసుకుంది. పోనీ అంతటితో ఊరుకుందా, "అంత చూసుకో పోడమేమిటీ?" అనేసింది. రామకృష్ణకి నిజంగా ఒళ్లు మండింది. తిమ్మిరెక్కిన చెయ్యిని పట్టుకుని కోపంగా "అర్థం పర్థం లేకుండా ఆ వెర్రినవ్వేమిటీ?" అన్నాడు. ఈ ఉడుకుమోత్తనం చూస్తే శారదకు మరీ నవ్వొచ్చింది. బలవంతాన్న నవ్వాపుకుంటూ దగ్గరికివచ్చి "పాపం అంతలా తగిలిందిటండీ?" అంది. ఈ వ్యంగ్య పరామర్శతో "అగ్గిమీద గుగ్గిలం జల్లినట్టు" రామకృష్ణ భగ్గుమని "చాలు నువ్వేం విచారించ నక్కర్లేదు. వెళ్ళవతలికి" అని చరచరా యివతలి కొచ్చేశాడు. "అయినా అంత వెకిలితనమేమిటీ మనిషికి? తనదాకా వస్తేసరి!" అనుకున్నాడు. మరి ఆనోట్లో ఏం వాక్శుద్ధి ఉందో మరోగంటకి వీధిలోకి వెళ్ళి కూరగాయలు కొని యింట్లోకి వస్తున్న శారద గుమ్మం కాలికి తగిలి బోర్లా పడిపోయింది. చేతిలో కూరలబుట్ట క్రిందపడి వంకాయలూ బీరకాయలూ "రన్నింగ్ రేస్" లో పాల్గొన్నాయి. అక్కడే పడకకుర్చీమీద పడుకుని పేపరు చదువుతున్న రామకృష్ణ నవ్వుకి అంతే లేకపోయింది. నాటకంలోలా నవ్వడం ప్రారంభించాడు. పోనీ అంతో యింతో తనూ అలాంటి స్థితే అనుభవించాడు కదా ఊరుకోవచ్చా "అయినా అంత ఒళ్లూ పయీ చూసుకోకుండా ఆ నడకేమిటీ "సిటీబస్సు" లాగ కాస్త ముందూ వెనకా చూసుకోకపోతే ఏమవుతుంది మరి? అయినా అంత జాగ్రత్తగా ఉండేవాళ్ళకి యీ పొరపాట్లేమిటో! ఇంతకీ సుబ్బమ్మ ఒదిన చెప్పినట్టు క్షణం మనది కాదుకదా!" అన్నాడు.

శారద నిజంగా అప్పుడు దైన్యపరిస్థితిలోనే ఉంది: గడపకి బొటకనవేలు తగిలి రక్తం కారుతోంది. మనిషి బోర్లా పడ్డంచేత చేతిమణుకులు కొట్టుకుపోయాయి. పైగా ఈ మాటలు. కళ్ళనీళ్ళెట్టుకుని లేచి తలా బట్టా సవరించుకుని కూరలు తీసుకుని గుమ్మందగ్గర నిలబడి—

"ఇవతలవాళ్లు చస్తున్నా అంత నవ్వులాటగా ఉందన్నమాట? వేలు చితికినా అయ్యో అన్న మాట లేదు. పైగా "మంత్రసాని దెప్పులూ" "అత్తగారి సాదింపులూ!" అయినా "మన వాడు గదా అని మహారాజుతో చెపితే మరి రెండు తగల్నియ్యమన్నాడని" మీతో చెప్పుకోడమేమిటి? ఛీ!" అని లోపలికి వెళ్ళిపోయింది. ఆ ఆఖరి "ఛీ!" అన్న పదం కొంతసేపటిదాకా రామకృష్ణ చెవుల్లో మార్మోగింది అంతే. తప్పెవరిదయితేనేం, ఆ తరువాత మాటల్లేవు. అయితే యింట్లో మూడో మనిషి లేకపోడంచేత కొన్ని మాటలు కాకపోతే కొన్నయినా పరోక్షంగా ఆడుకోక తప్పలేదు.

"వంటయింది రావచ్చు. నీళ్లు తోడిపేను, పోసుకుంటే మంచిది. వచ్చేటప్పుడు కాఫీ గుండ తెస్తేగాని రేపటికుండదు" ఇలాంటి "కర్త లోపించిన వాక్యాలు" రామక్రిష్ణకీ తప్పలేదు. "నా సిగరెట్ టిన్ ఎక్కడుందో?—చెక్కపొడి అయిపోయింది కాబోలు—నా సైకిలు తాళం ఎవరు తీశారో?" ఇలాంటివి.

అయితే యిద్దరూ మొదట్నుంచీ సరదాగా ఉండడానికి అలవాటు పడ్డారు కాబట్టి కొన్ని

మాటలు అప్రయత్నంగా దొర్లిపోయాయి.

శారదకి స్వతహా "విట్లు" వేయడం రాదుగాని రామక్రిష్ణదగ్గరకి వచ్చిన యీ ఏడాదిలో కొన్ని కాకపోతే కొన్నయినా నేర్చుకుంది. ఉదాహరణకి భోజనాలదగ్గిర అప్రయత్నంగా అందిశారద.

"కోపంవచ్చిన మనుషులికి ఆకలి ఎక్కువంటారు. ఈనాటికిగాని ప్రత్యక్షంగా తెలిసింది కాదుగదా!" రామకృష్ణ ఊరుకుంటాడా?

"నిజమే అయుండొచ్చు మధ్యాహ్నం మొగాళ్లు యింటిదగ్గర లేకుండా మాసి, అడ్డమైన పిల్చూ కలుపుకుని ఏదో ఆకృతిలోపోసుకుని ఆరగించడమేగా ఆడాళ్ళ ప్రకృతీ?" అనేశాడు.

"తప్పేముంది? అంతగా కడుపుకాలితే ఏ పెనమో కాలెయ్యక ఎలాగా తప్పదు. పోనీ నయమేగా, దోమలతోనూ ఈగలతోనూ దెబ్బలాడి ఏ పూరీనో నోట కరిచేకన్న?" అందామనుకుంది శారద. అయినా అనలేదు. "మాటలాడితే మరీ లోకువయిపోతుంది. ఈమనిషితో మాటలేమిటి?" అనుకుంది. అంతే, వాళ్ళిద్దరూ పరోక్షంగానైనా మాట్లాడుకోలేదు.

*　　*　　*

"ఆయనకే అంత యిదిగా ఉన్నప్పుడు నాకేనా ఏమిటి పట్టింది?" అనుకుంది అటువైపు తిరిగి పడుకున్న శారద.

"లేకపోతే ఏమిటి మరీనీ? చచ్చినంత దెబ్బ తగిలింది కాలికి. దగ్గిరకి రావడంలేదు, ఓ లేవదియ్యడంలేదు, పోనీ అక్కడ్నించేనా అయ్యో అనడంలేదు—ఏమంత మించిపోయిందినో అంత మొహం కందగడ్డలా చేసుకుని నవ్వేదాకా! తనకెంత దెబ్బతగిలింది. నాకెంత తగిలింది? ఇప్పటికి ఒళ్లు నొప్పులు పూర్తిగా వదల్లేదు. అయినా ఎలా చెబితే అలా చేస్తూంటే మనిషికి మరీ లోకువయిపోతోంది-నాలుగురోజులు మాటామంతీలేకుండా ఉంటేసరి అన్నీ వదులుతాయి!" శారద కొద్దిగా తిరిగి భర్తవైపు చూసింది. తెల్లటి పైజామా, గ్లాస్కో చొక్కా, కట్‌బనీనూ, యీ వేషాలు ఎవరికీ తెలియవని! ఒక్కసారి దగ్గిరకు వెళ్ళాలనిపించింది. కాలికి కట్టుకున్న కట్టును మాసి "ఛత్! ఈయనదగ్గిరకేమిటీ? ఆయనేవచ్చి పలకరించనీ!" అనుకుంది. అటులిరిగి బలవంతాన కళ్ళు మూసుకుంది.

ఇంటివారి గడియారం పన్నెండుకొట్టింది. సహజంగా రామకృష్ణకి నిద్రరట్టేదు.

"పొద్దుట మొఖుకు పచ్చడైతే తల విరగబడి నవ్వడం బాగుంది. "పగలగొట్టిన తియ్య గుమ్మడికాయలా" తనూ చేతీలోసరకూ యిల్లంతా పరుగులెడితే సహజంగా నవ్వితే తప్పొచ్చింది. ఎవరికన్లు వారికి బాగుంటాయి! ఆడదానికే అంత పౌరుషమైనప్పుడు మొగాడేనా అంత చేటుకువయింది? అది పలకరించాలి, నే మాట్లాడాలి, అంతే! చూడకూడదనుకుంటూ శారదవైపు చూశాడు రామకృష్ణ.

కిటికీలోంచి వచ్చిపడే వెన్నెలలో ఎంత బాగుంది! నల్లకాటిన్ జాకెట్ మీద ఎంబ్రాడయిరీ చేసిన లైట్‌రోజ్ కలరు ఖటావ్ వాయిలు చీరకట్టుకుంది. జడలోమల్లెపూలు పిలుస్తున్నాయి. ఇంత అలంకరణ దేనికి? తను వచ్చి బతిమాలుకుంటాడనే కదూ? ఈ తలంపు రాగానే రామకృష్ణకి ఒళ్లు మండింది.

"ఓ! ఇలాంటివి చాలా చూశాం! ఇంత మాత్రాన్ని పాదాక్రాంతుల మైపోయి ఎలా చెబితే అలా వినేలా తయారవం! చాలు! అది రావాలి, నన్ను పిలవాలి, నేను మాట్లాడాలి, అంతే!" పూర్తిగా శాలువ కప్పేసుకున్నాడు రామకృష్ణ.

శారదా, రామకృష్ణా యిద్దరూ ఒక్కసారే భయపడ్డారు. వారి గుండెలు భయంతో కొట్టుకున్నాయి. దానికి కారణం పెరట్లో ఏదోతవ్వుతున్నట్టు ఆ నిశిరాత్రిలో, నిశ్శబ్దకాలంలో స్పష్టముగా వినబడడమే. మళ్ళీమళ్ళీ ఆ చప్పుడు వినబడడంతో శారద అపరిమితంగా భయపడింది. సుజల సుఫల సుశ్యామలమైన భారతభూమిలో ఏదోవిధంగా కడుపునింపుకునే నిర్భాగ్యులు లెక్కలేనంతమంది ఉన్నారు. వారం రోజులై ఆ పేటలో దొంగతనాలుమరీఎక్కువగాఉన్నాయి. ఇంటివారమ్మాయి మొన్నరాత్రి డాబామీద ఆరవేసిన చీర తెచ్చుకోడం మరిచిపోతే తెల్లారేసరికి లేదు! మట్టపల్లివారి అబ్బాయీ, కోడలూ తలుపులు తాళాలు వేసుకుని "సెకండ్ షో" సినిమాకు వెళ్ళి వచ్చేసరికి ఇంట్లో అంటుగిన్నయినా లేకపోయిందట! కడుపు మండిన ఏ అభాగ్యుడు యింటికి కన్నం తవ్వుతున్నాడో! శారద ఒళ్లు

భయంతో ఒణికిపోయింది. మనిషి సాయంలేందే పట్టపగలయినా డాబామీదకు వెళ్ళలేని మనిషి! ఇప్పుడెలాగ? రామకృష్ణకూడా యించుమించు అదే పరిస్థితిలో ఉన్నాడు. ఇన్నేళ్లువచ్చినా ఒక్కడూ సెకండ్ షోకి వెళ్ళి యింటికిరాలేడు. "దొంగ" అంటే అతనికి చచ్చినంత భయమే! మళ్ళీఅదే తచ్చాడుతున్న చప్పుడు! అతడు దైన్యంగా శారదవైపు చూశాడు, సరిగ్గా అదే సమయానికి శారద అతనివంక చూసింది.

"విన్నారా, ఆ చప్పుడు?" అందామనుకుంది ఆమె. మళ్ళీ మనసు మార్చుకుంది. అటువైపు తిరిగి పడుకుంది.

"ప్రొద్దుట జరిగింది చాలదూ? నాకేనాసిగ్గం డాలి. దొంగలు దోచుకుంటే దోచుకోనీ. నా సొమ్మేం కాదుగదా? నా కున్న కొద్దిపాటి నగలూ ఒంటిమీనే ఉన్నాయి— రానీ చూద్దాం! ఎవడ్నో పురస్కరించుకుని నేనుముందుమాట్లాడ్డ మేమిటీ సిగ్గుచేటూ!"

అయినా ఆమెకు గుండెలు కొట్టుకుంటూనే ఉన్నాయి! శారద అటువైపు తిరిగిపోడం రామ కృష్ణ చూశాడు.

"ఉహూఁ అంతలా ఉందన్న మాట! సరే ఆ దొంగ వెధవెవడో పీకలమీదకి రానీ అప్పుడే తెలుస్తుంది నాకేం?" అంటూ శాలువ తన్నేశాడు. సరిగ్గా అదే సమయానికి వంటింట్లో ఏదో భళ్లు మంది. రాత్రి బద్ధకం కొద్దీ వెండికంచాలు అల మారాలో పెట్టి తాళం వెయ్యకుండా అలా వది లేసింది. ఇంకేముంది? శారద ఊరుకో లేక పోయింది.

"వెళ్ళి చూడకూడదూ, కొంప లంటుకుం టూంటేను?" అనేసింది! రామకృష్ణ పంతం కొద్దీ పలక్కుండా ఊరుకున్నాడు.

"నాకేమిటో భయంగా ఉందండీ!" అప్రయ త్నంగా అంది శారద. తగ్గిపోతున్న చంద్ర కాంతిలో భయంతో వివర్ణమైన ఆమె మొహం చూడగానే రామకృష్ణకి చెప్పలేనంత జాలి, అభి మానం పుట్టుకొచ్చాయి. తనుమాత్రం! పైకలా ధైర్యంగా ఉన్నాడుగాని "పల్సురేటు" ఎంత పెరిగిందనీ! తన పరుపు ఆమె పరుపుతో సరిగ్గా జరిపేశాడు రామకృష్ణ.

"ఎవరో యిల్లు తవ్వేస్తున్నట్టున్నారు సరిగ్గా వంటింటి వైపునుంచే వస్తోంది చప్పుడు. వెళ్ళి త్వరగా చూసిరండీ! నాకేమో మాచెడ్డభయంగా ఉంది." ఒణుకుతూ అంది శారద. రామకృష్ణ అప్పటికీ మాట్లాడలేదు. శారద అతనిమీద చెయ్యి వేసింది. రామకృష్ణ ఆమెను దగ్గిరగా తీసు కున్నాడు.

"అదేమిటండీ మీ ఒళ్లు అంతలా ఒణుకు తోంది? భయమే! పోనీ దొంగ దొంగని అరు ద్దామా?"

"ఏమో నానోటంటమాట రాడంలేదు! ఇలా నామీద చెయ్యివెయ్యి. ఏంచేద్దాం? నువ్వ చెప్పు."

"అలా భయపడితే ఎలాగ? పోనీ వంటింటి తలుపు యివతల గొళ్ళెం పెట్టేద్దామా?"

"దేనికి?"

"వచ్చినవాళ్లు అలా దోచుకుపోతారు! మన దగ్గిరకి రారు."

"మహ బాగుందికదూ? నీ సలహా విని యే పనైనా... అయ్యో... అయ్యో... యిదేమిటి?"

"ఏమిటీ?"

"నీతో మాట్లాడేస్తున్నానేమిటీ?" శారదముఖం సిగ్గుతో ఎర్రబడింది. "అలా అంటారుగాని... ఏవో చిలిపికయ్యాలు వస్తే వచ్చాయిగాని... మీరు నాతో మాట్లాడకుండా క్షణం ఉండ గలరా?"

"అందుకే కాబోలు ముందు మాట్లాడేశావు?"

వంటింట్లో మళ్లీ ఏదో చప్పుడయింది. ఇద్దరూ ఒణికిపోయారు.

"ఏ దొంగముండాకొడుకో... మంచోచెడ్డో వాడివల్లే యింతత్వరగా మనంమాట్లాడుకున్నాం. పదండి వెళ్లిచూద్దాం."

శారద లేచి స్విచ్ వేసింది. గదంతా కాంతి మయం అయింది.

"రండి చూద్దాం. చేతిలో ఆకర్రపట్టుకోండి. నేనీ చీపురు పట్టుకుంటాను... ఊఁ... రండి!" ఇద్దరూ ఒకర్నొకరు పట్టుకుని నెమ్మదిగా అడుగు లేస్తూ, గజగజ ఒణుకుతూ, వంటింటి తలుపు తెరి చారు! ఎవడా దొంగ? ఏముందక్కడ? తూము క్రింద పెద్ద గోతిని తవ్వుతున్న పందికొక్కు ఒక్కసారి పీటచాటుకు ఎగిరిపోయింది. శారదా రామకృష్ణా పావుగంటవరకూ నవ్వుకున్నారు. ఒకర్నొకరు చూసికాదు, యిద్దరూకలిసి.

(8-వ పేజీ తరువాయి)

తెలియదు. రష్యన్ల సహాయం లేకుండానే చైనా కమ్యూనిస్టులు పూర్తిగా స్వబలంపైనే ఆధారపడి జయించారని చాలమంది నొక్కి చెప్పుతున్నారు.

కాని అమెరికా అభిప్రాయం వేరు. చైనాలో కమ్యూనిస్టుల విజయానికి పూర్తిగా రష్యన్లే కారకులనీ, ప్రస్తుతం చైనాలో నెలకొన్న కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కేవలం రష్యా చేతి కీలుబొమ్మగానే పరిగణించాలనీ అమెరికన్లు వాదిస్తున్నారు. ఐసెన్ హోవర్ ప్రతిపాదించిన తీర్మానం ప్రకారం ఔటర్ మంగోలియా, దక్షిణ సఖాలిన్, క్యూరైల్ దీవుల వ్యవస్థనే కాకుండా, చైనాలో ప్రస్తుత వ్యవస్థను కూడా శాశ్వతమైనదిగా అమెరికా పరిగణించ బోదని ధృవపడుతున్నది. రష్యాచేతి "కీలుబొమ్మ" ప్రభుత్వాలక్రింద "దాస్యం"లో మగ్గుతున్న దేశాలకు చైనాతో సహా "స్వాతంత్ర్యం" తెచ్చిపెట్టడంకోసం ఇకనుంచి అమెరికా తీవ్రకృషి చెయ్యగలదు.

తూర్పు యూరోపియన్ దేశాలలో కమ్యూనిస్టు ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కృషిచేసే రహస్యదళాలకు అమెరికా ద్రవ్యమూ ఆయుధ సామగ్రి సహాయమిస్తున్నది. (1951 లోనూ 1951లోనూ పశ్చిమయూరప్ తూర్పు ఆసియా దేశాలకు యుద్ధసామగ్రి సప్లయి మొదలైన అంశాలపరంగా కేటాయించిన ధనంతో పాటు, పేర్లు చెప్పకుండా "మరికొన్ని దేశాలకు" అంటూ ట్రూమన్ కేటాయించిన కొంత అదనపు ధనం ఆయుధాల రూపేణా ఫార్మోజాకు, చెకోస్లోవాకియా, హంగరీ మొదలైన దేశాలలో కమూనిస్టు ప్రతికారోద్యమకారులకు అందినట్లు వార్తలు ప్రకటితమైనాయి.) అమెరికాలోనూ పశ్చిమ యూరప్‌లోనూ శరణార్థులైన తూర్పు యూరప్ దేశాలకు చెందినవారిని చేర్చి ప్రత్యేక సైన్యాలకు తరిఫీదు ఇవ్వబడుతోంది. క్రమక్రమంగా అమెరికాలో గ్రీస్, యుగస్లావియాల లోనూ, "జెకోస్లోవాక్ జాతీయ ప్రభుత్వమూ" "పోలిష్ జాతీయ ప్రభుత్వమూ" మొదలైనవి అవతరించవచ్చు. అయితే రష్యాతోనూ, తూర్పు యూరప్ ప్రభుత్వాలతో అమెరికన్ ప్రభుత్వానికి గల రాయబార వ్యవహారాలు తెగతెంపులు కాలంతో కాలం ఈ జాతీయ ప్రభుత్వాలకు అమెరికావల్ల పరోక్ష, సహాయ సానుభూతులే కాని ప్రత్యక్ష సహాయం లభించదు. రెండో ప్రపంచ యుద్ధకాలంలో లండన్‌లో ఒక పోలిష్ ప్రభుత్వమూ, లుబ్లిన్‌లో ఒక ప్రభుత్వమూ, వార్సాలో మరొక ప్రభుత్వమూ ఉండేవి. అదే రీతిగా జెకోస్లోవాకియా ప్రభుత్వం ఒకటి డాక్టర్ బెనిష్ ఆధ్వర్యం క్రింద లండన్‌లో వుండేది. తూర్పుయూరప్‌లోనూ ఉక్రేన్, బెయిల్ రష్యా రష్యాలలో కమ్యూనిస్టు ప్రతి కారోద్యమాలు గూఢంగా కొనసాగుతుంటే అమెరికాలోనూ పశ్చిమ యూరప్‌లోనూ, పోలిషుజాతీయ సైనిక దళాలు" మొదలైనవి సిద్ధపరచబడుతున్నాయి. అయితే ఇవేవీ ప్రపంచయుద్ధ ప్రజ్వలనకు తక్షణ కారణాలు కాలేవు. ఫార్మోజాపట్ల అమెరికా అనుసరించగల లిబరేషన్ పాలసీవల్ల చైనా అమెరికాల మధ్య ప్రత్యక్ష యుద్ధం సంభవించగల ప్రమాదం ఉంది.

ఫార్మోజాలోని చియాంగ్ ప్రభుత్వాన్నే చైనా ప్రభుత్వంగా అమెరికా ఫ్రాన్సు మొదలైన దేశాలూ ఐక్యరాజ్యసమితీ పరిగణిస్తున్నాయి. కొరియా యుద్ధం సమాప్తికాగానే అమెరికా, ఐక్యరాజ్యసమితి చైనాలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని గుర్తించగలవనే ఆశ ఇంక అంతరించింది, అమెరికా ఎన్నటికీ చైనాలోని "రష్యా చేతి కీలు బొమ్మ" ప్రభుత్వాన్ని గుర్తించబోదని ధృవపడుతోంది. యాల్టా ఒడంబడికలోని రహస్యాంశాలను నిరాకరించడంతో, ఫార్మోజాను చైనా ఆధిపత్యం కిందనుంచి శాశ్వతంగా విడగొట్టి అమెరికా తన యుద్ధవ్యూహానికి వినియోగించుకో గలదని స్పష్టపడుతోంది.

అంతర్జాతీయ నియమాల ప్రకారం కమ్యూనిస్టు చైనాపై యుద్ధం ప్రకటించ నవసరంలేకుండానే చియాంగ్ ప్రభుత్వం పేరున ఫార్మోజా నుంచి చైనా భూభాగంపై యుద్ధచర్యలు నడపడానికీ, కమ్యూనిస్టులు ఫార్మోజాపై దండయాత్ర చెయ్యడానికీ యత్నిస్తే ప్రత్యక్షంగా జోక్యం కల్పించుకుని నిరోధించడానికీ యాల్టా రహస్య నిర్ణయాల నిరాకరణ తోడ్పడుతుంది. బర్మా చైనా సరిహద్దులలోనున్న చియాంగ్ సేనల్ని బలపరిచి ఇకనుంచి చైనాపై దాడులను ఉధృ

తంగా సాగించవచ్చును.

ఇంక చైనాలో తిరిగి తన ప్రభుత్వస్థాపనకు అవకాశం త్వరలోనే లభించగలదనే ఆశతో చియాంగ్ మూడో ప్రపంచయుద్ధం ఆరంభం కోసం నిరీక్షిస్తున్నాడు. ఫార్మోజాపై కమ్యూనిస్టులు దండయాత్రచేసినా, చైనా భూభాగంపై జాతీయ సేనలు దండయాత్రచేసి ప్రమాదంలో చిక్కుకున్నా, అమెరికన్లు యుద్ధంలో జోక్యం చేసుకోక తప్పదనే సంగతి చియాంగ్‌కు తెలుసు. అయితే ఈ విధంగా చైనా అమెరికాల మధ్య యుద్ధాన్ని రెచ్చగొట్టడానికి చియాంగ్ ఎంత త్వరపడగలడో గమనించడం అవసరం. న్యూయార్క్ టైమ్స్ సూచించిన నిగూఢాంశం ఫార్మోజా రక్షణకు అమెరికన్ల ప్రత్యక్ష సహాయంలో ఉంది. మూడో ప్రపంచ యుద్ధ ప్రమాదం చియాంగ్ సాహసాలలో ఉంది.

## పర్షియాలో అశాంతి

అశాంతి అనేది మధ్య ఆసియా రాజ్యాలలో కొత్తగాదు. ఈ రాజ్యాలలో ప్రభుత్వాలనూ రాజకీయోద్యమాలనూ తమ ప్రయోజనాలకోసం వినియోగించుకోడానికి బ్రిటన్, అమెరికా రష్యా చేస్తున్న తీవ్రకృషి ఒక వంక, దారిద్ర్యంభరించలేక విప్లవోన్ముఖులై వివిధ రాజకీయ పక్షాలకు అర్థమనస్కులనుగానే బలపరుస్తున్న ప్రజలొక వంక తీవ్రతరంగా అశాంతి వ్యాపించడానికి తోడ్పడుతున్నారు.

పెట్రోల్ పరిశ్రమ పరుల అధీనంలో ఉన్న అదువల్ల దేశానికి సంభవించిన అనర్థం చూసి బ్రిటిషు వారిని దేశంనుంచి వెళ్ళగొట్టిన పర్షియన్ మజ్లిస్ (శాసనసభ) రాజకీయ వైరాలకూ కల్లోలానికీ నిలయమయింది. దేశ ఆర్థికస్థితీ, ప్రభుత్వ ఆదాయమూ బొత్తిగా క్షీణించాయి. పరిస్థితులు నియంతృత్వానికి పరిపక్వమై ఉన్నాయి. కాని పార్టీల బలమూ సంపద్బలమూ కలవారందరూ తమ సంపదలను రాజకీయప్రాబల్యాన్ని కాపాడుకోడానికి నియంతృత్వాన్ని నిరోధించాలని మజ్లిస్‌ద్వారా యత్నిస్తున్నారు. ప్రధాని ముసాదిక్ ప్రభుత్వాన్ని మజ్లిస్ అదుపులో పెట్టి నియంతృత్వాన్ని కొంతవరకూ నిరోధించింది.

పర్షియాలో సంఘ సంస్కరణలకీ, ఆధునిక జీవన సౌకర్యాలను ప్రవేశపెట్టడానికి మొదట కృషిచేసినవాడు రిజా పహావీ. ఇతడు పాశ్చాత్యులకు అనుకరించి రాజ్యాంగసంస్కరణలను ప్రవేశపెట్టినప్పుడు దేశంలోని భూస్వాములు భగ్నపరచడానికి యత్నించారు. రిజా కుమారుడు రాజు (షా) కాగానే రాజరిక ప్రాబల్యం సన్నగిలిపోయింది. భూస్వాములు బలపరిచిన మత ప్రధానమైన సంస్థలు బలపడి వాని ఆధారంతో ముసాదిక్ ప్రధాని కాగలిగాడు. పర్షియాలో బలీయమైన ట్యూడే పార్టీని భూస్వాములు అవసరానికి వీలైనంత వరకూ వినియోగించుకుని, ఆ పార్టీలో కమ్యూనిస్టులప్రాబల్యం అధికంకాగానే అణచివెయ్యడానికి కృషిచేశారు. పెట్రోలు పరిశ్రమ ప్రభుత్వపరంకాగానే జాతీయపక్షం ఒకటే ఇప్పుడు దేశంలో నిలిచింది.

కాని క్రమేణా జాతీయపక్షాల పట్లానూ ట్యూడేపార్టీ పట్లనూ విశ్వాసం సన్నగిలిపోతుంది. భూమిశిస్తు సంస్కరణలలో షా ఆస్తిని కూడా విడగొట్టడానికి ముసాదిక్ ప్రయత్నించడంతో మంత్రివర్గానికీ షాకీ మధ్యఉన్న కొద్ది సామరస్యం చెడిపోయింది: ముసాదిక్ మంత్రివర్గానికింతవరకు లభిస్తున్న ప్రజాదరణను గమనించి షా పర్షియా రాజకీయాలలో జోక్యం కలిగించుకోకుండా ఊరుకున్నాడు. ఇప్పుడు తన ఆస్తిని అన్యాక్రాంతం చెయ్యాలని మంత్రివర్గం చేస్తున్న యత్నాన్ని ప్రతిఘటించాడు.

పర్షియా రాజకీయాలలో ఉత్పన్నమైన ఈ కొత్తవైరంతో ప్రభుత్వంపట్ల అసంతృప్తి చెందినవారు షాపక్షాన పెద్దఉద్యమం లేవదీశారు.

అనేక సంవత్సరాలుగా పర్షియా రాజకీయాలలో మరుగుపడి ఉన్న రాజరికం తిరిగి ప్రజాదరణతో తలెత్తింది. ముసాదిక్ నియంతృత్వానికి బలమైన ప్రత్యర్థిపక్షం బయలుదేరింది.

ఈ ఉభయవర్గాల మధ్యనూ అకస్మాత్తుగా సంభవించిన సంఘర్షణ ఇంతటితో ఏ రాజీపద్ధతినో చల్లారడం కష్టం. నియంతృత్వానికి పరిపక్వమై ఉన్న పర్షియాలో సైనికోద్యోగుల సహాయంతోకాని జాతీయపక్షాల ప్రోద్బలంతో ఒక రాజకీయవేత్తకాని నియంతృత్వాధికారాన్ని వహించగల సమయం ఆసన్నమయింది. అయితే నియంతృత్వం ఏ పక్షం పాలబడినా కొంత కాలం తీవ్ర సంఘర్షణ తప్పదు.